# వాల్గోటి కిషన్

## ఎక్సెలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్

తల్లి తండ్రి గురువు దైవం అన్నారు...

దేవుడికంటే ముందే గురువుకి స్థానం ఎందుకిచ్చారో చెప్పడానికి ఈ ఉపాధ్యాయుడి జీవితం ఒక ఉదాహరణ.

వాల్గోటి కిషన్. పాటిల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు.

స్వస్థలం ఖానాపూర్‌మండలం బిలవార్‌పూర్ గ్రామం.

గవర్నమెంటు టీచర్ అంటే స్కూల్లో పిల్లలు ఉన్నా లేకపోయినా రోజూ వెళ్లి సంతకం పెట్టి వచ్చే ఉద్యోగం అనే ముద్ర చాలామందిలో ఉంది.

కిషన్ మాస్టార్ని చూస్తే... ఆయన పనిచేస్తున్న, ఇప్పటికే చేసి వచ్చిన పాఠశాలలకు వెళితే మాత్రం ఆ ముద్ర క్షణాల్లో చెరిగిపోతుంది.

పాఠాలు చెప్పడంతో తన పని అయిపోయిందని ఈ ఉపాధ్యాయుడు ఏనాడూ అనుకోలేదు.

తన బడిలో పిల్లలు ఎంతమంది ఉన్నారు... ఎంతమంది ఉండాలి... ఎంతమంది బడి మధ్యలోనే మానేశారు... ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం కనుక్కుంటారాయన. అంతటితో ఆగిపోకుండా ప్రభుత్వ పాఠశాలను గొప్పగా తీర్చిదిద్దడం తన కర్తవ్యంగా భావిస్తారు. స్కూల్‌ను శుభ్రంగా ఉంచడం, కనీస అవసరాలు కొరవడితే తన సొంత ఖర్చులతో వెంటనే ఏర్పాటు చేయడం, డ్రాపవుట్స్ ఉంటే... వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించి ఆ పిల్లల్ని మళ్లీ బడిబాట పట్టించడం కిషన్ మాస్టారికి నిత్యకృత్యం.

నవోదయ, గురుకుల పాఠశాలలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు

ఉచితంగా ఏర్పాటు చేసి ప్రవేశపరీక్ష రాయిస్తారు. స్కాలర్‌షిప్ వచ్చే అవకాశమున్న నిరుపేద విద్యార్థులను గుర్తించి, దగ్గరుండి తానే దరకాస్తు చేయించి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చేస్తారు. పదవతరగతి పిల్లలకోసం సాక్షి భవిత ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకాలను పెద్దమొత్తంలో తీసుకుని ఎస్ ఎస్‌టి పిల్లలకు ఉచితంగా పంపిణీ చేశారు ఈ మాస్టారు. ఇక పాఠశాల విద్యకు సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని అమలుచేయడంలో ముందుంటారీయన. ఎప్పుడూ ఒకటే ధ్యాస... పిల్లలు, చదువు, బడి, సమాజం... ఇంతే. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ఉపాధ్యాయుడు ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు అందుకున్నారు. 2016 సంవత్సరం వాల్గోటి కిషన్‌ను భారతప్రభుత్వం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవించింది. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది అని నమ్మి... ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేసేందుకు శ్రమిస్తున్న ఈ ఉత్తమ ఉపాధ్యాయుడిని సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017 ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ విభాగంలో సత్కరిస్తోంది.